RNI-TELTEL/2017/72695

23 ఆగస్టు 2023

# శుభ తెలంగాణ

బుధవారం | మేడ్చల్ 
ఎడిటర్: చంద్రశేఖర్

సంపుటి : 6, సంచిక :169 
వెల:3 రూ/-
www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

## 4 ఏళ్ల వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలన లో 40 ఏళ్ల అభివృద్ధి

### రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

### సీపన్నాయుడు పేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

### విపక్షాల అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టండి అని పిలుపు

### రూ.26.65లక్షల వ్యయంతో నిర్మించిన నీటి సరఫరా పైపు లైను, సామాజిక భవనాన్ని ప్రారంభించిన మంత్రి



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** 4 ఏళ్ల వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 40 ఏళ్ల అభివృద్ధిని తీసుకుని వచ్చామని, సీఎం వైయస్ జగన్ అనేక పాలన సంబంధ సంస్కరణలను అమలు చేశారని రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న విలీన పంచాయతీ సీపన్నాయుడు పేటలో గడపగడపకూ మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రిగా చంద్రబాబు

వివరాలు 2లో..

## రెండు చోట్ల పోటీ ప్రజా ధనం వృధా చేయడమే



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** :కేసీఆర్ వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, బీఆర్ఎస్ అంటే బంధువులు రాబంధువుల సమితి అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ధ్వజమె త్తారు. కంటోన్మెంట్ టికెట్‌ను దివంగ త ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందితకు ఇవ్వడం, కోరుట్ల టికెట్ విద్యాసాగర్ రావు తనయుడి ఇవ్వడంతో కేసీఆర్ పరివార్ వాది రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.కోరుట్ల టికెట్ వ్యవహారం కుటుంబానికి సంబంధించిందని

వివరాలు 2లో..

## కేసీఆర్ పాలనలో 88 వేల మంది

# రైతుల మృతి

### అన్నదాతలకు అన్యాయం.. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు: రేవంత్

### మేం రాగానే రూ.2 లక్షల రుణమాఫీ

### 4 వేల పెన్షన్.. 2లక్షల ఉద్యోగాలు

### కేసీఆర్ పాలనపై తిరగబడదాం

### కాంగ్రెసలోకి చేవెళ్ల బీఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ రాష్ట్రంలో 88 వేల మంది రైతులు చనిపోయారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఆరుగాలం శ్రమించి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా కల్పించని పరిస్థితి నెలకొందన్నారు. మంగళవారం చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో గెలిచేది, అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనని, నెలకు రూ.4 వేల పెన్షన్ పథకాన్ని అమలు చేసి తీరుతుందని ప్రకటించారు. తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయన్న కేసీఆర్.. వచ్చాక పేదల సంక్షేమాన్ని మరిచారన్నారు. దళితులకు భూములు పంచింది, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ హయాంలోనేనని గుర్తు చేశారు. రాష్ట్ర సంపదను కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు దోచిపెడుతున్నారని,

వివరాలు 2లో..

## ఆక్రమణలో ఉన్న ఆలయాల భూములను స్వాధీనం చేసుకుంటాం

### డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ





**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ఆలయ భూముల అన్యాక్రాంతాన్ని సహించేది లేదని డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. 4.60 లక్షల ఎకరాల దేవాలయాల భూమి ఆక్రమణల్లో ఉన్నట్టు, 1.65 కోట్ల గజాల వాణిజ్య స్థలాలు ఆక్రమణలో ఉన్నాయని గుర్తించామని చెప్పారు. ఆక్రమణల్లో ఉన్న దేవాదాయ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. సచివాలయంలో మంత్రి

వివరాలు 2లో..

## సాఫ్ట్ ల్యాండింగ్.. ఎంత క్లిష్టమో!

### చంద్రయాన్-3లో అత్యంత కీలకమైన దశ అదే

### '20 మినిట్స్ ఆఫ్ టెర్రర్'గా పేర్కొంటున్న శాస్త్రజ్ఞులు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** అది.. 2019, సెప్టెంబరు 7! సమయం అర్ధరాత్రి దాటింది. చంద్రయాన్-2 మిషన్‌లో భాగంగా భూమి నుంచి 3.84 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన ప్రవేశించిన ల్యాండర్ విక్రమ్.. సరిగ్గా చంద్రుడి దక్షిణ ధ్రువం పైభాగానికి చేరుకుంది. సరిగ్గా ఆ సమయంలో చంద్రుడిపై సూర్యోదయం ప్రారంభమైంది. అరుణుడి లేత కిరణాలు చంద్రుడిపై ప్రసరిస్తుండగా.. ఆ లేలేత వెలుగులో విక్రమ్.. లిక్విడ్ థ్రస్టర్ ఇంజన్లను మండించుకోవడం ద్వారా వేగాన్ని నియంత్రించుకుంటూ కిందికి దిగడం ప్రారంభించింది. ఆ తర్వాత ఏమైందో ఏమో.. దాన్నుంచి సంకేతాలు ఆగిపోయాయి. అందరిలోనూ తీవ్ర ఉత్కంఠ. ఏమయింది? విక్రమ్ సజావుగా

వివరాలు 2లో..

## ప్రపంచానికే వృద్ధి ఇంజన్‌గా భారత్

### త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా అవతరిస్తాం..

### బ్రిక్స్ సదస్సులో మోదీ





**హైదరాబాద్(శుభ తెలంగాణ):** మున్ముందు మొత్తం ప్రపంచ వృద్ధికే భారత్ ఒక ఇంజన్‌లా నిలుస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న బ్రిక్స్ బిజినెస్ ఫోరం లీడర్స్ సమావేశంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. "మా ప్రభుత్వం ప్రత్యేక లక్ష్యంతో పనిచేసి దేశంలో సులభతర వ్యాపారాన్ని మరింతగా పెంచాం. త్వరలోనే 5

వివరాలు 2లో..

## మేం లేకుంటే మునుగోడులో మీ పరిస్థితి ఏమయ్యేది?

- బీజేపీ దూకుడు అడ్డుకోవడానికే అప్పట్లో తాము మద్దతిచ్చామన్న కూనంనేని
- బీజేపీకి దగ్గరైతే మిత్రధర్మం పాటించాలి కదా అని హితవు
- మునుగోడులో బీజేపీ గెలిస్తే బీఆర్ఎస్ ప్రమాదంలో పడేవారు కాదా? అని ప్రశ్న
- లెఫ్ట్ పార్టీలపై చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని వెల్లడి

వివరాలు 2లో..



## కన్నేసి.. కాటేశారు!

### మీర్‌పేట గ్యాంగ్‌రేప్ ఘటనలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి

### ప్రధాన నిందితుడు కరడుగట్టిన నేరగాడు, రౌడీషీటర్

### వయసు 35.. హత్య, దోపిడీ సహా అతడిపై 26 కేసులు

### గంజాయి మత్తులో ఉండగా బాలికపై ఆ సైకో చూపు

### కత్తితో బెదిరించి.. మరో ఇద్దరితో కలిసి అత్యాచారం

### సహకరించిన నలుగురు.. ఏడుగురూ అరెస్టు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** రాజధాని నగరంలో సంచలనం సృష్టించిన మీర్‌పేట గ్యాంగ్ రేప్ ఘటనలో ఏడుగురు నిందితులనూ పోలీసులు 24 గంటలు తిరక్కుండానే అరెస్ట్ చేశారు. వారిలో ప్రధాన నిందితుడి పేరు అబేద్ బిన్ ఖలేద్ (35). వృత్తిరీత్యా మెకానిక్. నేరాలు చేయడం అతడి ప్రవృత్తి. హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, దొంగతనాలు.. ఇలా అతడిపై నగరంలోని పలు స్టేషన్లలో 26 కేసులున్నాయి. రాచకొండ కమిషనరేట్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ డీఎస్ చౌహాన్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన బాధిత బాలిక.. కొన్నాళ్ల క్రితం తన ఇద్దరు తమ్ముళ్లతో కలిసి నగరానికి చేరుకుని లాలాపేట శాంతినగర్‌లో ఉంటోంది. ఆమె తల్లిదండ్రులు ఒడిశాలోనే ఉంటారు. కాగా, వారం రోజుల క్రితం ఆ బాలిక.. మీర్‌పేట పీఎస్ పరిధిలోని నందనవనంలో ఉంటున్న వరుసకు సోదరి అయిన మహిళ వద్దకు వచ్చింది. మరోవైపు.. మంగళ్‌హాట్

వివరాలు 2లో..

# సాఫ్ట్ ల్యాండింగ్.. ఎంత క్లిష్టమో!

- మొదటి పేజీ తరువాయి

ల్యాండయిందా? లేక కుప్పకూలిపోయిందా? అనే భయం! ఆ భయమే నిజమైంది. జాబిలిపై సాఫ్ట్ ల్యాండింగ్‌లో విఫలమైన విక్రమ్ ల్యాండర్ .. చివరి క్షణాల్లో తలకిందులుగా పడిపోయింది....ఒక్క మన విక్రమ్ ల్యాండరే కాదు. అభివృద్ధి చెందిన దేశాలు చేపట్టిన పలు మూన్ మిషన్లు కూడా ఈ చివరి దశను అధిగమించలేక చతికిలపడ్డాయి. ఎందుకిలా? సాఫ్ట్ ల్యాండింగ్‌లో ఎందుకివన్నీ విఫలమయ్యాయి? ఇంతకీ సాఫ్ట్ ల్యాండింగ్ అంటే ఏమిటి? ఆ దశను 'భయానక 20 నిమిషాలు (20 మినిట్స్ ఆఫ్ టెర్రర్)'గా ఎందుకు అభివర్ణిస్తారు? అంటే.. అది నిజంగానే అత్యంత క్లిష్టమైన దశ. ఎందుకంటే.. భూమికి ఆకర్షణ శక్తి ఉన్నట్టే చంద్రుడికి కూడా ఆకర్షణ శక్తి (భూమితో పోలిస్తే చాలా తక్కువగా) ఉంటుంది. ప్రస్తుతం చంద్ర కక్ష్యలో తిరుగుతున్న విక్రమ్ ల్యాండర్.. మామూలుగా జాబిలి ఉపరితలంపై దిగే ప్రయత్నం చేస్తే ఆ ఆకర్షణ శక్తికి వేగంగా వెళ్లి కూలిపోతుంది. అలా కూలిపోకుండా ల్యాండర్ నెమ్మదిగా వెళ్లి అక్కడ దిగితే దాన్ని సాఫ్ట్ ల్యాండింగ్ అంటారు. ల్యాండర్ అలా నెమ్మదిగా దిగడానికి దాదాపు 19 నిమిషాల సమయం పడుతుంది. ఆ సమయంలో ఏ దశలో ఏం జరుగుతుందంటే..

**రఫ్ బ్రేకింగ్ దశ**

**లక్ష్యం: ల్యాండర్ వేగాన్ని తగ్గించడం**

**సమయం: 690 సెకన్లు**

ఈ దశలో ల్యాండర్ చంద్రుడి ఉపరితలానికి సమాంతరంగా ప్రయాణిస్తుంటుంది. చంద్రుడి ఉపరితలం నుంచి 30 కిలోమీటర్ల ఎత్తున ఉన్న ల్యాండర్ 7.4 కిలోమీటర్ల ఎత్తుకు, ల్యాండింగ్ ప్రదేశానికి 32 కిలోమీటర్ల దూరానికి (సమాంతరంగా) చేరుకుంటుంది. ల్యాండర్ వేగం గంటకు 6 వేల కిలోమీటర్ల నుంచి గంటకు 1,288.8 కిలోమీటర్లకు తగ్గుతుంది.

**ఆల్టిట్యూడ్ హోల్డింగ్ ఫేజ్**

**లక్ష్యం:** ల్యాండర్ వర్టికల్ వేగాన్ని తగ్గించడం, సమాంతరంగా ఉన్న ల్యాండర్ స్థితిని కొంతమేరకు నిలువుగా మార్చడం

**సమయం:** 10 సెకన్లుఈ దశలో ల్యాండర్ సమాంతర వేగం గంటకు 1,288.8 కిలోమీటర్ల నుంచి 1,209.6 కిలోమీటర్లకు తగ్గుతుంది. వర్టికల్ వేగం గంటకు 219.6 కిలోమీటర్ల నుంచి 212.4 కిలోమీటర్లకు తగ్గుతుంది. ల్యాండర్ కూడా 7.4 కిలోమీటర్ల ఎత్తు నుంచి 6.8 కిలోమీటర్ల ఎత్తుకు దిగుతుంది. సమాంతరంగా ఉన్న ల్యాండర్ నిట్టనిలువు స్థితిలోకి రావడానికి వీలుగా తొలుత 50 డిగ్రీల మేర వంగుతుంది.

**ఫైన్ బ్రేకింగ్ దశ**

**లక్ష్యం:** ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలానికి 800 మీటర్ల ఎత్తుకు తేవడం

**సమయం:** 175 సెకన్లుబీ 800 మీటర్ల ఎత్తుకు చేరకున్నాక అక్కడే 12 సెకన్లపాటు నిలిచి ఉంటుంది.

ఈ దశలో.. చంద్రుడి ఉపరితలం నుంచి 6.8 కిలోమీటర్ల ఎత్తు నుంచి ల్యాండర్ 800 మీటర్ల ఎత్తుకు దిగుతుంది. ఆ సమయానికి.. దాని సమాంతర, వర్టికల్ వేగాలు సున్నాకు చేరుకుంటాయి. ల్యాండర్ 12 సెకన్లపాటు అక్కడే నిలిచి ఉంటుంది. దాని కోణం 50 డిగ్రీల నుంచి 90 డిగ్రీలకు మారుతుంది. ల్యాండర్ కాళ్లు చంద్రుడి దిక్కుకు తిరిగి.. దిగడానికి సిద్ధంగా ఉంటాయి. ఆ సమయంలో ల్యాండర్‌లోని హజార్డ్ డిటెక్షన్ అండ్ ఎవాయిడెన్స్ కెమెరా పనిచేయడం ప్రారంభిస్తుంది. ల్యాండింగ్ లొకేషన్‌ను ఫొటో తీసి.. అక్కడ దిగడానికి సురక్షిత వాతావరణం ఉందా లేదా దాంట్లోని కృత్రిమ మేధ విశ్లేషిస్తుంది. మిగతా పరికరాల సమాచారం సాయంతో ల్యాండర్.. ల్యాండింగ్ సైట్ దిశగా కదులుతుంది.

**టెర్మినల్ డిసెంట్ ఫేజ్-1**

**లక్ష్యం:** సురక్షిత ల్యాండింగ్‌సైట్‌ను గుర్తించడం

**సమయం:** కిందికి దిగడానికి 131 సెకన్లుబీ చంద్రుడి ఉపరితలానికి 150 మీటర్ల ఎత్తుకు చేరాక అక్కడే 22 సెకన్లపాటు నిలిచి ఉంటుంది.

ఈ దశలో ల్యాండర్ చంద్రుడి ఉపరితలానికి 800 మీటర్ల ఎత్తు నుంచి 150 మీటర్ల ఎత్తుకు చేరాల్సి ఉంటుంది. చంద్రుడి గురుత్వబలం ల్యాండర్‌ను కిందకి లాగుతుంటే.. ల్యాండర్‌లోని గ్రౌండ్ ఫేసింగ్ రాకెట్లు అది వేగంగా కిందికి జారిపోకుండా గంటకు 18 కిలోమీటర్ల వేగంతో దాన్ని కిందికి దింపుతుంటాయి. 131 సెకన్ల తర్వాత ల్యాండర్ చంద్రుడి ఉపరితలం నుంచి 150 మీటర్ల ఎత్తుకు చేరుతుంది. అక్కడ 22 సెకన్లపాటు నిలిచి ఉండగా.. దాంట్లోని పరికరాలు ల్యాండింగ్ ప్రదేశాన్ని గుర్తిస్తాయి.

**టెర్మినల్ డిసెంట్ ఫేజ్ 2**

**లక్ష్యం:** ల్యాండర్ చంద్రుడి ఉపరితలం నుంచి 60 మీటర్ల ఎత్తుకు చేరుకోవడం సమయం: 52 సెకన్లు

చంద్రుడి ఉపరితలానికి 150 మీటర్ల ఎత్తున ఉన్న ల్యాండర్.. ఈ దశలో 60 మీటర్ల ఎత్తుకు దిగుతుంది. దాంట్లోని కృత్రిమ మేధ పరికరాలు సురక్షితమైన ల్యాండింగ్ ప్రదేశాన్ని నిర్ధారిస్తాయి. అక్కడికి చేరుకోవడానికి ల్యాండర్ నెమ్మదిగా దిశ మార్చుకుంటుంది.

**టెర్మినల్ డిసెంట్ ఫేజ్ 3**

**లక్ష్యం:** సాఫ్ట్ ల్యాండింగ్‌కు ముందు దశ

**సమయం:** 38 సెకన్లు

కృత్రిమ మేధ నిర్ధారించిన సురక్షిత ల్యాండింగ్ ప్రదేశంలో.. ల్యాండర్ గంటకు 4.7 కి.మీ. వేగంతో దిగడం ప్రారంభిస్తుంది. చంద్రుడి ఉపరితలానికి 60 మీటర్ల ఎత్తు నుంచి 10 మీటర్లకు జారుతుంది. ఆ దశలో ల్యాండర్‌లోని ఇంజన్లన్నీ షట్‌డౌన్ అవుతాయి.

**టెర్మినల్ డిసెంట్ ఫేజ్ 4 (ఫ్రీఫాల్ దశ)**

**లక్ష్యం:** ల్యాండర్ చంద్రుడిపై దిగడం

**సమయం:** 9 సెకన్లు

చంద్రుడి ఉపరితలానికి 10 మీటర్ల ఎత్తున ఉన్న ల్యాండర్‌లోని ఇంజన్లన్నీ షట్‌డౌన్ అవగానే.. చంద్రుడి గురుత్వశక్తి కారణంగా కిందికి జారడం మొదలుపెడుతుంది. దాని కాళ్లు చంద్రుణ్ని తాకగానే.. వాటిలో ఉండే సెన్సర్లు యాక్టివేట్ అవుతాయి. ల్యాండర్ చంద్రుడి మీద దిగిన 1.25 సెకన్లకు.. ఆ విషయం ఇస్రో గ్రౌండ్ కంట్రోల్‌కు తెలుస్తుంది.

**..ఇక్కడితో ల్యాండర్ ల్యాండింగ్ ప్రక్రియ విజయవంతమైనట్టు. అయితే, దీని తర్వాత ఇంకో దశ కూడా ఉంది. అది.. ల్యాండర్‌లోని రోవర్ బయటకు వచ్చి పరిశోధనలు చేసే దశ. కానీ అందుకు కొన్ని గంటల సమయం పడుతుంది. కారణమేంటంటే.. 10 మీటర్ల ఎత్తు నుంచి ల్యాండర్ కిందికి జారి పడినప్పుడు ఆ తాకిడికి పైకి లేచిన చంద్రధూళి సర్దుకోవడానికి కొన్ని గంటలు పడుతుంది. అంతా సద్దుమణిగాక.. ల్యాండర్‌లోని రోవర్ బయటకు వస్తుంది. అప్పుడు ఆ రెండూ పరస్పరం ఫొటోలు తీసుకుని భూమికి పంపుతాయి. రెండూ సురక్షితంగా ఉన్నాయనడానికి ఆ ఫొటోలే నిదర్శనం. దీంతో చంద్రయాన్-3 పూర్తిగా సఫలమైనట్టు లెక్క.**

# 4 ఏళ్ల వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలన లో 40 ఏళ్ల అభివృద్ధి

- మొదటి పేజీ తరువాయి

14 ఏళ్లు ఉన్నారు. ఆయనేం చేశారో చెప్పాలి ? ఈ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలోనే అనేక పాలన సంస్కరణల అమలుతో యావత్ భారతావని దృష్టిని ఆకర్షిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు అవుతోంది. కానీ ఇప్పటిదాకా బ్రిటిషర్ల నాటి సర్వే రికార్డులనే పట్టుకుని తిరుగుతున్నాం. ఈ ప్రభుత్వం వచ్చేక సమగ్ర భూ సర్వేకు ప్రాధాన్యం ఇస్తూ అత్యాధునిక సాంకేతికతతో, శిక్షణ పొందిన సిబ్బందితో గ్రామాలలో మరో తగాదాకు తావు లేకుండా ఉండేందుకు పనిచేస్తోంది. సమగ్ర భూ సర్వేను ఎప్పుడో స్వాతంత్ర్యం పూర్వం నిర్వహించారు. వందేళ్ల తరువాత సమగ్ర భూ సర్వే నిర్వహిస్తూ, నిష్పాక్షిక ధోరణిలో పనిచేస్తున్నాం. ఒకనాడు గ్రామాలలో తగాదాలు అన్నీ భూ తగాదాలే. తద్వారా అశాంతి నెలకొనేది. కానీ ఇప్పుడు అటువంటి తగాదాలు అన్నవి లేవు. శత శాతం నిజాయితీతో, నిబద్ధతతో ఈ సర్వే చేపడుతున్నాం అని చెప్పేందుకు సంతోషిస్తూ ఉన్నాను. ఎక్కడ ఎక్కువ భూమి వినియోగంలో ఉంటుందో అక్కడ జీడీపీ గ్రోత్ రేట్ బాగుంటుంది అని గతంలో వెల్లడయిన వాస్తవం. అందుకే ఎక్కువ భూమిని వినియోగంలోకి తీసుకుని వచ్చి ఎక్కువ వర్గాలను ప్రభావితం చేసే విధంగా, తద్వారా ఆర్థిక లబ్ధి అందుకునే విధంగా,వారంతా పలు పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రెండు వేల గ్రామాలలో సమగ్ర భూ సర్వే పూర్తి చేశాం. ఇకపై మీ గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా చర్యలు చేపడుతున్నాం. డబుల్ రిజిస్ట్రేషన్లకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. రికార్డు అంతా స్పష్టంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మీ చెంతకే పాలన తీసుకుని వచ్చాం. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పాలనలో మంచి సంస్కరణలు తెచ్చాం. వాటి ఫలాలు మీరంతా అందుకున్నారు. ఫలితాలు ఏ విధంగా ఉన్నాయి అన్నది చూశారు.

పాలన సంస్కరణలను చూశాక విపక్షాలు తట్టుకోలేక అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయి. విజ్ఞత ఉన్న పౌరులంతా వీటిని తిప్పికొట్టాలి. మేలు చేసే ప్రభుత్వానికే మద్దతు ఇవ్వాలి. ఇవాళ దేశంలో ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు సైతం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విధి విధానాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ముఖ్యంగా వైద్య వ్యవస్థ లో అనేక మార్పులు తీసుకు వచ్చాం. మన రిమ్స్ ఆస్పత్రిలో అనేక సదుపాయాలు అందుబాటులో తీసుకు వచ్చాం. ఈ రోజు ఒక్క పైసా లంచం తీసుకునే వారు ఎవ్వరూ లేరు. అంటే క్షేత్ర స్థాయిలో అవినీతిని అరికట్టగలిగాం. గతంలో ఏ ప్రభుత్వమూ ఈ విధంగా పనిచేసిన దాఖలాలు లేవు. నిష్పక్షపాతంగా పథకాలు అమలు చేసి అందిస్తున్నాం. విపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు 14 ఏళ్ళు ముఖ్య మంత్రిగా ఉంటూ,శ్రీకాకుళం పట్టణానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నిస్తున్నా..? పట్టణ మార్కెట్ ను గత ప్రభుత్వంలోనే మంత్రులు అచ్చెన్నాయుడు,నారాయణ ఎంపీ రామ్మోహన్ నాయుడు అనేక సార్లు సందర్శించారు. సందర్శించిన ప్రతిసారి మేదర వీధిలో ఉన్న బుట్టలను తన్నారే తప్ప మార్కెట్ ను ఏం అభివృద్ధి చేశారు..? కానీ మా ప్రభుత్వం మార్కెట్ ను ముందన్నెడు లేని విధంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ప్రధాన రోడ్లు వేయించింది. ఇంకా అనేక పనులు చేపట్టింది. మరి ఆ రోజు టీడీపీ అధికారంలో ఉండగా ఇవన్నీ చేయగలిగారా ? ఇవన్నీ ఆలోచించండి. ఎవరు మేలు చేశారు ? ఎవరు ప్రజల క్షేమం కోరి ఉన్నారు అన్నది మీరు బేరీజు వేసుకోండి. ఇవాళ కేవలం ఓట్లు కోసం చేపట్టిన కార్యక్రమం అయితే ఇది కాదు. నాలుగేళ్ల పాలనపై మీ అభిప్రాయం తెలుసుకునేందుకే వచ్చాను.

అలానే నా దృష్టికి వచ్చిన స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తాను. మీరంతా మరోసారి పాలనలో వచ్చిన మార్పులను గమనించండి. అలానే విపక్ష శ్రేణులు చెప్పే మాటలను నమ్మకండి అని మంత్రి ప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు,రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతి, డాక్టర్ దానేటి శ్రీధర్, పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షులు సాదు వైకుంఠ రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా అలివేలు మంగ, సీపాన రామారావు, పైడి రాజారావు, పొన్నాడ రిషి, వనపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# కన్నేసి.. కాటేశారు!

- మొదటి పేజీ తరువాయి

సీతారాంపేట్‌కు చెందిన అబేద్ బిన్ ఖలేద్ నందనవనంలో ఉండే తన స్నేహితులు తహసీన్, మాంకాల మహేశ్, ఎం.నర్సింగ్, అష్రఫ్ వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. మహేశ్ కూలీ పని చేస్తుండగా.. నర్సింగ్ శుభకార్యాలకు బ్యాండ్ వర్కర్‌గా, అష్రఫ్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. వీరంతా కలిసి గంజాయ్ సేవించేవారు. ఈ క్రమంలో ఈ నెల 19న అబేద్ బిన్ ఖలేద్.. నందనవనం వచ్చాడు. అక్కడే బాలికను చూశాడు. ఆ రోజే ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ బాలికపై అత్యాచారం చేయాలన్న దుర్బుద్ధితో ఈ నెల 21న ఉదయం 11 గంటల సమయంలో తన గంజాయి బ్యాచ్‌తో కలిసి బాలిక ఇంటికి వెళ్లాడు. ఆమె జుట్టు పట్టుకొని బెడ్రూంలోకి లాక్కెళ్లి.. నోటిని అదిమిపెట్టి.. కత్తితో బెదిరించి.. అబెద్ బిన్ ఖలేద్, తహసీన్, మహేశ్ ఆమెపై అత్యాచారం చేశారు. అక్కడే ఉన్న బాలిక తమ్ముళ్లిద్దరిని నర్సింగ్, అష్రఫ్‌లు బెదిరించి దూరంగా పంపించివేశారు. అనంతరం.. బాలిక జరిగిన దారుణం గురించి తన సోదరికి చెప్పి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు ఎస్‌వోటీ పోలీసులు బృందాలుగా బయలుదేరారు. దీంతో నిందితులు రసూల్‌పురలో ఉండే తమ స్నేహితులైన మహ్మద్ ఫైజల్, మహ్మద్ ఇమ్రాన్‌ల సాయంతో నగరం విడిచి పారిపోయారు. కానీ పోలీసులు వారిని సాంకేతిక పరిజ్ఞానం సాయంతో వెంబడించి కర్ణాటక రాష్ట్రం ఉమ్నాబాద్ వద్ద, మరికొందరిని నగరంలో అరెస్ట్ చేశారు. వారికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూస్తామని కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. నిందితులందరికీ గంజాయి తాగే అలవాటు ఉందని, ఆ సమయంలో కూడా ఇద్దరు తాగినట్లు అనుమానాలున్నాయని చెప్పారు. కాగా.. బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. బాధిత బాలికను సంరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లో గంజాయి ముఠాలు.. వాటితోపాటే ఈ తరహా అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ ముఠాల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రెండు చోట్ల పోటీ ప్రజా ధనం వృధా చేయడమే

- మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ చెప్పడాన్ని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ట్విట్టర్‌కే పరిమితమయ్యారని కేసీఆరే బహిరంగంగా నిరూపించారని ఎద్దేవా చేశారు. తన గెలుపుపై నమ్మకం ఉన్న సీఎం రెండు స్థానాల్లో పోటీ చేసి మరొక చోట ఉప ఎన్నికలను ఎందుకు కోరుకుంటున్నారని ప్రశ్నించారు. ఇది ప్రజాధనాన్ని వృథా చేయడమే అని మండిపడ్డారు.నిజామాబాద్‌లో తన కూతురు పట్టు కోల్పోకుండా చూసుకోవడం కోసమే కామారెడ్డిలో కేసీఆర్ విఫలయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి దృష్టి మళ్లించేందుకే కవిత మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పేరు నిరసనలు చేసిందని ఆరోపించారు. దుర్గం చిన్నయ్య, వనమా వెంకటేశ్వరరావు లాంటి వారికి అవకాశం కల్పించిన బీఆర్ఎస్ పార్టీలో 40 మంది మహిళా అభ్యర్థులు లేరా అని నిలదీశారు.

# ఆక్రమణలో ఉన్న ఆలయాల భూములను స్వాధీనం చేసుకుంటాం

- మొదటి పేజీ తరువాయి

కొట్టు సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. దేవాదాయ శాఖ భూముల స్వాధీనానికి చట్టంలో కీలక మార్పులు చేసి కొత్త ఆర్డినెన్స్ తీసుకొచ్చామని వివరించారు. రూ.5 లక్షల ఆదాయం లోపు ఉన్న 23,600 ఆలయాలను గుర్తించామని, ఈ దేవాలయాలను అర్చకులకు, ఫౌండర్ ట్రస్టీకి అప్పగించనున్నామని చెప్పారు. వీటికి ఇప్పటి వరకు 37 అప్లికేషన్స్ వచ్చాయని, ఫౌండర్ ట్రస్టీ, వారి కుటుంబ సభ్యులు ముందుకువస్తే ఆలయాల పర్యవేక్షణ బాధ్యతలు వారికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ధర్మ ప్రచార కార్యక్రమాలను సంవత్సరం పొడవునా ప్రముఖ ఆలయాల పరిధిలో కొనసాగిస్తామని వివరించారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని చాటించడమే ప్రధాన లక్ష్యమన్నారు. శ్రీకాళహస్తి దర్శనానికి వెళ్తే షాపులు మూయించినట్టు కొన్ని పత్రికలు ఇష్టానుసారంగా ప్రచురించాయని మండిపడ్డారు.

# కేసీఆర్ పాలనలో 88 వేల మంది రైతుల మృతి

- మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ చుట్టూ 10 వేల ఎకరాలను కేసీఆర్ కుటుంబం ఆక్రమించుకుందని, రూ.లక్ష కోట్లు సంపాదించుకుందని ఆరోపించారు. పావలా వడ్డీ, బంగారు తల్లి పథకాలను కేసీఆర్ సర్కారు అటకెక్కించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామని, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఇల్లు కట్టుకునే ప్రతీ పేదవాడికి రూ.5 లక్షలు సాయం అందిస్తామని పునరుద్ఘాటించారు. మరోవైపు హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం చేశానంటూ కేసీఆర్ గప్పాలు కొడుతూ.. నగరాన్ని గంజాయి, మత్తు పదార్థాలకు అడ్డాగా మార్చారని ఎక్స్ (ట్విటర్)లో రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గతంలో సింగరేణి కాలనీలో, తాజాగా మీర్‌పేటలో ఆడబిడ్డలపై అఘాయిత్యాల కలచివేస్తున్నాయన్నారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని.. ప్రజల మాన ప్రాణాలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ఇలాంటి పాలనపై తిరగబడదాం.. తరిమికొడదాం అని పిలుపునిచ్చారు.

# ప్రపంచానికే వృద్ధి ఇంజన్‌గా భారత్

- మొదటి పేజీ తరువాయి

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మావద్ద ఉంది" అని మోదీ స్పష్టం చేశారు. దక్షిణాఫ్రికాలో మంగళవారం ప్రారంభమైన బ్రిక్స్(బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల 15వ సదస్సు గురువారం వరకూ జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు మంగళవారం జొహెన్సబర్గ్‌కు మోదీ చేరుకున్నారు. వాటర్‌క్లూఫ్ వాయుసేన స్థావరంలో మంగళవారం ల్యాండ్ అయిన భారత ప్రధానికి దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే స్వాగతం పలికారు. అనంతరం జొహనెసబర్గ్‌లో బ్రిక్స్ సదస్సు జరగనున్న శాండ్‌టన్ సన్ హోటల్‌కు చేరుకున్న మోదీకి సంగీత వాయిద్యాలు, భారత పతాకాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. వారిలో ఇద్దరు మహిళలు ఆయనకు రాఖీ కట్టడం విశేషం. అనంతరం నార్త్ రైడింగ్‌లో 14.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న స్వామినారాయణ్ ఆలయాన్ని ప్రధాని సందర్శించారు. కాగా.. ఈ సదస్సు ముగిసిన అనంతరం గ్రీస్‌లో ఒకరోజు పర్యటనకు ప్రధాని చేరుకుంటారు.

**వచ్చే 7న భారత్‌కు బైడెన్**

వచ్చే నెల 7 నుంచి 10 వరకూ భారత్‌లో జరిగే జీ-20 సదస్సులో పాల్గొనేందుకు గాను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత్‌కు రానున్నారని శ్వేతసౌధ కార్యాలయం మంగళవారం తెలిపింది. వివిధ ప్రపంచ సమస్యలపై జీ20 భాగస్వామ్య దేశాలు చర్చిస్తాయని శ్వేతసౌధ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్-పియరీ తెలిపారు.

# మేం లేకుంటే మునుగోడులో మీ పరిస్థితి ఏమయ్యేది?

కమ్యూనిస్ట్ పార్టీలు లేకపోతే మునుగోడు ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పరిస్థితి ఏమయ్యేదో అందరికీ తెలుసునని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల భేటీ అనంతరం ఆయన మాట్లాడుతూ... మునుగోడులో కేసీఆర్ తమ మద్దతు కోరారని చెప్పారు. బీజేపీ దూకుడును అడ్డుకోవాలని తాము బీఆర్ఎస్‌కు అండగా నిలిచినట్లు చెప్పారు. ప్రత్యేక పరిస్థితుల్లో అప్పుడు మద్దతు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత కూడా పలు సందర్భాల్లో తాము, లెఫ్ట్ పార్టీలు కలిసి ఉంటామ ని కేసీఆర్ స్వయంగా చెప్పారన్నారు. కేసీఆర్ రైతు సమస్యలపై కూడా తమతో చర్చించారన్నారు. కేసీఆర్‌కు ఉత్సాహం వచ్చినప్పుడు తమకు ఫోన్లు చేశారన్నారు. ఆ తర్వాత ఏమైందో తమకు తెలియదన్నారు. కానీ మునుగోడులో లెఫ్ట్ లేకుంటే బీఆర్ఎస్ గెలిచేది కాదన్నారు. మునుగోడులో బీజేపీ గెలిస్తే మీరు ప్రమాదంలో పడేవారు కాదా? అని ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో ఎంతబేరసారాలు జరిగాయో తెలియదా? అన్నారు. బీజేపీతో కేసీఆర్‌కు సఖ్యత కుదిరినట్లుగా కనిపిస్తోందన్నారు. బీజేపీకి దగ్గరైతే కనీసం మిత్రధర్మం పాటించాలి కదా అన్నారు. బీజేపీ అండదండలు ఉంటే చాలనుకుంటున్నట్లుగా ఉందన్నారు. నిన్న లెఫ్ట్ పార్టీలపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఏదేమైనా వచ్చే ప్రభుత్వంలో తాము నిర్ణయాత్మకంగా మారుతామన్నారు. బీఆర్ఎస్‌తో పొత్తు చెడినప్పటికీ వ్యక్తిగతంగా దూషించమని, విధానపరంగా మాత్రమే వ్యతిరేకిస్తామన్నారు.

## శేరిలింగంపల్లి నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి.. జెర్రిపేటి జైపాల్



**శుభ తెలంగాణ :**2023 లో జరిగే తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గా పోటీ చేసే వారు నాంపల్లి లోని గాంధీ భవన్ లో దరఖాస్తులు చేసుకుంటున్న సందర్భంగా శేరిలింగంపల్లి నియోజక వర్గంకీ సంభందించిన సీనియర్ నాయకులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలి అని తన అనుచరులు, అభిమానుల తో కలసి ఉత్సాహంగా భారీ ర్యాలీగా

తరలి వెళ్ళి తన అప్లికేషన్ సమర్పించిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ జేరిపేటి జైపాల్ ఈ సందర్బంగా మాట్లాడుతూ ఆది నుండి కాంగ్రెస్ పార్టీ నీ అంటి పెట్టుకొని ఉన్నాను అని పార్టీ కష్ట కాలం లో సైతం కాంగ్రెస్ పార్టీ జెండా యే ఊపిరి గా బతికిన నాకు మా సామాజిక వర్గం వడ్డెర కులస్తుల కోటా లో శేరిలింగంపల్లి నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ నాకు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అన్నీ వర్గాల ప్రజల కీ చట్టసభలలో అవకాశం ఇచ్చి ప్రోత్సహించే ఏకైక పార్టీగా చరిత్ర సృష్టిస్తుందని అన్నారు. పార్టీకి సుదీర్ఘమైన సేవలు అందించిన మా విజయం కీ అన్నీ వర్గాల ప్రజలు సహకరిస్తారు అని అన్నారు.అభిమానులూ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమములో పాల్గొన్నారు

## జోత్స్నా శివారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రేణుకా-అశోక్ రెడ్డి.



**కొంపల్లి అగస్టు-23 శుభ తెలంగాణ :** ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన రేణుక అశోక్ రెడ్డి మంగళవారం నాడు టి పి సి సి ప్రధాన కార్యదర్శి. కొంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ జోత్స్నా శివారెడ్డిని మంగళవారం నాడు తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. తమపై నమ్మకంతో ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలుగా ఎన్నిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా తమ పని చేస్తామని తెలిపారు. రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో అదిష్టానం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి ఎవ్వరిని కారారు చేసిన కుత్బుల్లాపూర్ లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకై అందరిని మమేకం చేసి ప్రస్తుతం నడుస్తున్న కుటుంబ పాలనకు ఇక ఓటు ద్వరా బుద్ది చెప్పడానికి కర్యాకర్తలు సద్దంగా ఉన్నారని వారన్నారు.

## కొంపల్లి మున్సిపాలిటీ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్తాపన చేసిన ఎమ్మెల్యే కె పి వివేకానంద్.




**కొంపల్లి ఆగస్టు-23 శుభ తెలంగాణ :**జయదర్శిని ఎనక్లేవ్ లో 20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే.. సాయికృప అపార్టుమెంట్స్ లో 10 లక్షల వ్యయంతో బి టి రోడ్డు పనులు మరియు 32 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్ లైన్ పనుల ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేసారు. ప్రజయ్ అపార్టుమెంట్స్ లో 18 లక్షల వ్యయంతో కె.ఎల్ సంప్ వెల్ పనుల శంకుస్థాపన చేసారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జయదర్శిని ఎనక్లేవ్ లో 20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్, సాయి కృప అపార్ట్మెంట్ లో 10 లక్షల వ్యయంతో బి.టి. రోడ్డు పనులు మరియు 32 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్ లైన్ పనులు, ప్రజయ్ అపార్ట్మెంట్ లో 18 లక్షల వ్యయంతో కె.ఎల్ .సంప్ వెల్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ ముఖ్య అతిథిగా స్థానిక మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య మరియు కౌన్సిలర్ల తో కలిసి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపనలు చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి కాలనీ అభివృద్ధే తమ ధ్యేయం అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సీనియర్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘ నాయకులు,సభ్యులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

**శుభ తెలంగాణ :**త్రిపురాంతకం మండలం మిరియంపల్లి గ్రామ సచివాలయం పరిధిలో 2వ రోజు జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగును. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొంటారు అని కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల సచివాలయ కన్వీనర్, మండల ముఖ్యనాయకులు, సొసైటీ అధ్యక్షులు, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన వలసిందిగా కోరుచున్నాము.

# వామపక్ష సామాజిక శక్తులతో సిపిఐ, సిపిఎం కలిసి రావాలి.




**శుభ తెలంగాణ :**యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపు. ఎన్నో ఆశలతో పోరాడి సాధించుకున్న తెలంగాణ సామాజిక తెలంగాణ గా ఏర్పడాలని సబ్బండ వర్గాలు కాంక్షించాయని ఉమ్మడి రాష్ట్రంలో అగ్రవర్ణ ఆధిపత్య పార్టీలు ఏ రకమైన పాలన సాగించాయో అదే తరహా పాలన నేడు తెలంగాణ లో కొనసాగుతున్న దని దీనికి మరింత బలపరిచే విధంగా నిన్న ఆగష్టు 21 వ తేదీన బి ఆర్ యస్ అధినేత కేసీఆర్ గారు రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ప్రకటించిన తీరు అందులో అగ్రవర్ణ ఆధిపత్య కులాల కే 58 మంది ని ప్రకటించటం,60'/, ఉన్న బిసి లకు 23 సీట్లు మిగిలిన 30 స్థానాలు యసి , యస్ టి లకు రిజర్వ్ అని ఈ రకంగా బిసి సమాజానికి బి ఆర్ యస్ మొండి చేయి చూపటం బిసి సమాజం ఆలోచన చేయాలని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపు నిచ్చారు.

ది:-22-8-2023 రోజు యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యాలయం ఓంకార్ భవన్ హైదరాబాదు లో యంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర కమిటీ సభ్యులు మైదం శెట్టి రమేష్ గారి అధ్యక్షతన జరిగిన నిర్ణయం లను అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు.

ఈ సందర్భంగా యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ సిపిఐ, సిపిఎం పార్టీలు కేసీఆర్ పిలిచి సీట్లు ఇస్తారని వేయి కళ్ళతో ఎదురు చూసారని కానీ కేసీఆర్ సిపిఐ ,సిపిఎం లకు మొండి చేయి చూపించాడని దీని తో సిపిఐ, సిపిఎం లు గతాన్ని గురించి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలే కాదు ఈ రాష్ట్రంలో ప్రజా పునాది కలిగిన వామపక్ష,కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి. యంసిపిఐ(యు) పార్టీ ఏ బూర్జువా భూస్వామ్య పాలక వర్గం తో ఏ నాడు ఎన్నికల లో కలిసి పోటీ చేయలేదు.

మతోన్మాద బిజెపి దాని ప్రజా వ్యతిరేక పాలన కు వామపక్ష, కమ్యూనిస్టు శక్తులు,సామాజిక శక్తులు ఐక్యం అయి చేసే పోరాటాలు మాత్రమే బిజెపి ఇతర దోపిడీ,పాలక వర్గ పార్టీల కు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయం ఏర్పాటు అవుతుందని ఈ విధానం ను ఈ 14 సంవత్సరాల గుణపాఠం తో నైనా వామపక్ష,సామాజిక లతో కలిసి ప్రయాణం చేసే విధంగా కలిసి రావాలి అని యంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సిపిఐ, సిపిఎం పార్టీలకు లేఖ వ్రాశామని అన్నారు.

కమ్యూనిష్టు, అంబేద్కర్ శక్తులను ఐక్యం చేయుటకు యంసిపిఐ(యు) శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నదని మిగితా వామపక్ష సామాజిక శక్తులు కలిసి రావాలి అని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్సు వనం సుధాకర్, కుంభం సుకన్య,వసుకుల మట్టయ్య, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్, యస్ కె నజీర్, వడ్తీయ తుకారాం నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు పరికిరాల భూమయ్య, నీల రవీందర్,తాండ్ర కళావతి, టి. అనీల్ కుమార్,మేత్రి రాజశేఖర్, గడ్డం నాగార్జున,మాలోతు జబ్బార్ నాయక్, నర్రా ప్రతాప్, గాదె మల్లేశం, కంచే వెంకన్న,పి.భగ్యమ్మ,వసుకుల సైదక్క,మాస్ సావిత్రి, వసుకుల గోపి, పోతుగంటి కాశి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తీజ్ ఉత్సవాలు

తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొన్న చౌదరిగూడ సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్



**శుభ తెలంగాణ ::**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం చౌదరిగూడ లో ఘనంగా తీజ్ వేడుకలు, తరతరాలుగా సంస్కృతి సాంప్రదాయంగా వస్తున్న పండుగ మంచి వరుడు దొరకలని పెళ్ళీడు యువతులు 9 రోజుల పాటు చేసే పండుగ తీజ్. ఈరోజు చౌదరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో లో వెంకటాద్రి టౌన్షిప్ ఫేస్ 3 డ్వాక్రా భవనం ముందు మైదానం లో బంజారా (లంబాడీ) వారు తీజ్ ఉత్సవాలను ఘనంగా ఆట పాటలతో జరిపారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్ హాజరు కాగా బంజారా అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు వారు అందరూ స్వాగతం పలికారు. సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్ మాట్లాడుతూ మా గ్రామంలో ఇదే మొదటి సారి ఇక్కడ పండుగ చేయడం జరిగింది. ఇది మొదలు కొని ప్రతి ఏట ఈ తీజ్ ఉత్సావాన్ని ఇలాగే జరుపుకోవాలని దీనికి నా యొక్క సహాయ సహకారాలు ఏళ్ళవెల మీకు తోడు ఉంటాయని నాకు చాలా ఆనందంగా ఉన్నది అని చెప్పడం జరిగింది. ఈ తీజ్ పండుగను లంబాడీ వాళ్ళు తమకు మంచి వరుడు దొరకని 9 రోజుల పాటు మొలకలకు మరియు పుట్ట మట్టిని తెచ్చి నవధాన్యాలను విత్తుతారు. ఉపవాస దీక్షలు తో పూజలు చేస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ కుర్ర మహేందర్ గౌడ్, వార్డ్ సభ్యులు లక్ష్మణ్ గౌడ్, బండ్లగుడ వాని నాగేష్,బంజారా అధ్యక్షులు,రాజేందర్ నాయక్, చౌదరిగూడ గ్రామ ప్రధాన కార్యదర్శి వెంకటేష్,నాయకులు సంతోష్ గౌడ్,బండ్లగుడెం ప్రవీణ్ బంజారా కమిటీ సభ్యులు బాలనాయక్ పవన్, రెడ్డి నాయక్ మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసిన ఉప్పల్ బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి....



**హైదరాబాద్, ఆగస్టు 22,(శుభ తెలంగాణ)**ఉప్పల్ నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గా తనను ప్రకటించిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ని ప్రగతి భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసిన బీ ఆర్ ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్ బీ ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గా ప్రకటించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో గెలుస్తామని అన్నారు. కెసిఆర్ కేటీఆర్ లు తన పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని నియోజవర్గంలో ప్రతి ఒక్కరిని కలుపుకొని పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి సాయి జేన్ శేకర్, పన్నాల దేవేందర్ రెడ్డి, జెర్రి పోతుల ప్రభుదాస్, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి,బీ సీనియర్ నాయకులు సాయి జేన్ శేకర్,ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## మళ్ళీ వచ్చేది బిఆర్ ఎస్ ప్రభుత్వమే

- ముఖ్యమంత్రి అయ్యేది కెసిఆరే
- ప్రజలు సుఖ శాంతులతో ప్రశాంతంగా ఉండాలి
- జనంపై ఆ భగవంతుడి చల్లని చూపు ఉండాలి
- యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**శుభ తెలంగాణ :**యాదగిరి గుట్ట

ఎవరేమి చేసినా, ప్రతిపక్షాలు తలకిందులుగా పొర్లుదండాలు పెట్టినా, రాష్ట్రంలో మళ్ళీ వచ్చేది బిఆర్ ఎస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి అయ్యేది కల్వకుంట్ల చంద్రశేఖర్ రావేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజలు సుఖ శాంతులతో ప్రశాంతంగా జీవించాలంటే, కెసిఆర్ సీఎం కావాల్సిందేనని ఆయన అన్నారు. ఆ భగవంతుడి చల్లని చూపు, కృపాకటాక్షాలు ప్రజలపై ఉండాలని తాను కోరుకున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ ఎస్ అభ్యర్థులను నిన్న సోమవారం తెలంగాణ భవన్ లో సీఎం కెసిఆర్ ప్రకటించిన తర్వాత, ఈ రోజు మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తన ఇలవేల్పు, ఇష్టదైవం యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

శాంతియుత ఉద్యమం ద్వారా తెలంగాణను సాధించిన సీఎం కెసిఆర్, ముఖ్యమంత్రి అయ్యాకే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. సీఎం కెసిఆర్, బిఆర్ ఎస్ ప్రభుత్వ పనితీరుని ప్రజలు మెచ్చారని, ఇంత జనరంజకంగా, ప్రజోపయోగంగా పరిపాలన చేసిన సీఎంలు గతంలో రాలేదన్నారు. సీఎం కెసిఆర్ సీఎం కావాలని, బిఆర్ ఎస్ ప్రభుత్వం తెలంగాణలో మళ్ళీ రావాలని, ప్రజలు ప్రశాంతంగా జీవించాలని తాను కోరకున్నట్లు తెలిపారు. లక్ష్మీనర్సింహ స్వామి దీవెనలు అందరిపైనా ఉంటాయని, మహిమాన్వితమైన దేవాలయానికి మెరుగులు దిద్ది, న భూతో, న భవిష్యతి అన్న చందంగా అభివృద్ధి చేసిన సీఎం కెసిఆర్, ఆయన కుటుంబం, పార్టీ, ప్రభుత్వంపై దేవుడి దీవెనలుంటాయన్నారు.

# డోర్ టు డోర్ జరిగిన ఓటర్ సర్వే సమగ్ర సమాచారం

# ఆయా రాజకీయ పార్టీలకు అందజేస్తాం...


● ఎన్నికల అధికారి జి . వసంత బాబు

**శుభ తెలంగాణ :**చిలకలూరిపేట : నియోజకవర్గ ఎన్నికల అధికారి జి వసంత బాబు ఆదేశాల మేరకు మంగళవారం నాడు స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోగల గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో ఓటరు నమోదు అధికారి జి. వసంత బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో స్పెషల్ సమరి రివిజన్ లో భాగంగా ది.21:7:2023 నుండి జరుగుచున్న ప్రి రివిజన్ ఆక్టివిటీస్ డోర్ టు డోర్ సర్వే లో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వచ్చి ఓటర్ల జాబితా తాజాపరుచుట ప్రక్రియ 96.11% పూర్తి చేయడం జరిగినదని అని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఓటర్ల జాబితా రూపొందుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సమురి రివిజన్-2024 లో భాగంగా ప్రి-రివిజన్ యాక్టివిటీస్, హౌస్ టు హౌస్ సర్వే , చనిపోయిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు , తరలింపు ఓట్లు, ఓటర్లను తొలగింపు మొ // అంశాలు లను గురించి వివరించి,వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. సందర్భంగా ఎన్నికల అధికారి జి వసంత బాబు మాట్లాడుతూ బి ఎల్ ఓ లు , స్పెషల్ సమ్మరీ రివిజన్ లో భాగంగా డోర్ టు డోర్ చేసిన సర్వే వివరాల సమగ్రమైన సమాచారాన్ని ఆయా రాజకీయ పార్టీలకు అందజేస్తారని తెలిపారు ఈ కార్యక్రమము నందు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు చిలకలూరపేట, యడ్లపాడు నాదెండ్ల తాహాశీల్దారు వార్లు మరియు చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ , మరియు అన్ని మండలాల సూపర్ వైజర్లు, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ తరపున షేక్ అజారుద్దీన్. మురుకొండ మల్లిబాబు. వై.ఎస్. ఆర్. సి.పి పార్టీ తరఫున విడుదల శేషగిరి. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎం. రాధాకృష్ణ . కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ఆర్. సుబ్బాయమ్మ .భారతీయ జనతా పార్టీ తరఫున అన్నపరెడ్డి. లక్ష్మణ్,నవతరం పార్టీ తరఫున రావు సుబ్రహ్మణ్యం,బహుజన సమాజ్ పార్టీ తరఫున ఎం. కోటేశ్వరరావు . జనసేన పార్టీ తరఫున బి. సుబ్బారావు, మరియు ఇతర పార్టీ నాయకులు హాజరై ఉన్నారు.





# పద్మభూషణ్ డా:చిరంజీవి గారి 68వ జన్మదినం ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్



**శుభ తెలంగాణ :**చిలకలూరిపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పర్చూరు లో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం నందు ఆకు పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఉత్సవ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రదక్షణ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్ మాట్లాడుతూ చిరంజీవి నిండు నూరేళ్లు అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ఆకు పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు చిరంజీవి బ్లడ్ ఐ బ్యాంక్ ఏర్పాటు చేసి ఎంతోమందికి నేత్రదానం రక్తదానం చేసి ఎన్నో కుటుంబాలలో వెలుగులు నింపారని అన్నారు కరోన కష్ట సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటుచేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడి ప్రాణదాత అయ్యారని అన్నారు. తన తోటి సినీ కళాకారులకు సినిమా కార్మికులకు సి సి టి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిత్యవసర సరుకులు ఏర్పాటుచేసి వారి కుటుంబాలకు ఆపద్బాంధవుడు అయ్యారని అన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి నిండు నూరేళ్లు జీవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని చిలకలూరిపేట మండల అధ్యక్షులు పటాన్ ఖాదర్ బాషా చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు షేక్ మునీర్ హసన్ సాంబ పసుపులేటి సాయి వెంకటేష్ రవి మరియు పర్చూరు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు వరం... ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్న క్యాంటీన్లు



**శుభ తెలంగాణ :**చిలకలూరిపేటలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లు ఎంతోమంది పేదలకు వరంగా మారాయి. పేదవాడికి పట్టెడన్నం పెట్టేందుకు మాజీమంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. స్థానిక గడియార స్తంభం సెంటర్, ఎన్ఆర్టీ సెంటర్‌లోని అన్న క్యాంటీన్ల వద్ద నిత్యం వందలాది మంది పేదలు ఆకలి తీర్చుకుంటున్నారు. మంగళవారం (22.08.23) రెండు అన్న క్యాంటీన్ల ద్వారా 972 మందికి భోజన సదుపాయం కల్పించారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్న క్యాంటీన్ల వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. మంగళవారం రెండు అన్న క్యాంటీన్ల వద్ద జవ్వాజి బుచ్చిబాబు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఉదయ్‌శంకర్ సింగ్, తదితరులు సేవలు అందించారు.

# కూతుర్ని చంపిన కసాయితండ్రి



**శుభ తెలంగాణ :** మంగళవారం సాయంత్రం ఏడు ఎనిమిది మధ్యలో కన్న తండ్రి చేతిలో కూతురు హత్యకు గురైన కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు ప్రకటించి ఆదుకోవాలని జిల్లా వృత్తిదారుల సంఘం నాయకులు రాయల మాలకొండయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు జెపి రాజు మాదిగ అన్నారు, కసాయి తండ్రికి కఠిన కారాగార శిక్ష విధించి బాధితురాలికుటుంబానికి న్యాయం చేసి ఇలాంటి ఘటనలు మరలా పునరావతం కాకుండా కఠినమైన ఆంక్షలు విధించాలనివారన్నారు ,,పామూరు మండలం మార్కొండపురం గ్రామ నివాసి బోసిరాజు నరసమ్మ వైఫ్ ఆఫ్ వెంకటేశ్వర్లులకు ముగ్గురు సంతానం, 14 సంవత్సరాల లోపు ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు, హత్యకు గురైన బూసిరాజుమంజుల పేద రజక కుటుంబానికి చెందిన వ్యక్తి,వయసు 12 సంవత్సరాలు, కనిగిరి గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న ది, తల్లిదండ్రుల గొడవల గత రెండు సంవత్సరాల నుంచి కొనసాగుతుంది, ఒకసారి మాల్కొండాపురంలో కూడా గొడవలు జరిగితే పామూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది, ఆ తర్వాత రాజీ కుదరటంలో మరల సాఫీగాజరుగుతున్న క్రమంలో రెండు నెలల క్రిందట మల్ల గొడవలు జరిగి కత్తితో పొడవ పోతే తప్పించారు, అప్పట్నుంచి తన తండ్రి గారి గ్రామం పద్మాపురం వెలిగండ్ల మండలం లో పిల్లలు తల్లి ఉంటున్నారు, ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు కనిగిరి గర్ల్స్ హై స్కూల్ కి వెళ్లి వారి కుమార్తె మంజులను తోడుకొని పద్మాపురం వెళ్దాం అని చెప్పి కనిగిరి టౌన్ లో వస్తుండగా అమ్మమ్మగారు చూడడం జరిగినది, ఈ క్రమంలో కనిగిరి మండలం నేలటూరి గొల్లపల్లి ఆంజనేయస్వామి గుడికి ఎదురుగా ఉన్న పాతదారిలో బండరాయితో కొట్టి చంపడం జరిగింది, , తెల్లారి బుధవారం ఉదయం ఆరు గంటలకి నేలటూరు గొల్లపల్లి వాస్తవ్యులు చూడటం జరిగి మీడియాకు చెప్పడం జరిగింది, ఆ తర్వాత ప్రభుత్వ అధికార యంత్రాంగం అప్రమత్తమై విచారించటం జరిగింది.

# ఎమ్మెల్యే టిజేఆర్ సుధాకర్ బాబు పి ఏ పై సమగ్ర విచారణ చేపట్టాలి

● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



**శుభ తెలంగాణ :**పభుత్వ శాఖలలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ యువత ను మోసం చేసిన సంతనూతలపాడు శాసన సభ్యులు టిజేఆర్ సుధాకర్ బాబు పి ఏ బండారు సురేష్ వ్యవహారం పై సమగ్ర విచారణ చేపట్టాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొమ్మినేని వారి పాలెం కు చెందిన నిరుద్యోగ యువత కందుల పుల్లారావు, నాగబాము అశోక్, కందుల అనీల్ ల నుండి ఆరు లక్షల యాభై వేల రూపాయలు తీసుకుని ఐ ఐ ఐ టి లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసారనీ, బాధితులు మా ఉద్యోగాలు ఏవి అని ఎమ్మెల్యే పి ఎ సురేష్ ను ఒత్తిడి చేయగా సాక్షాతూ జిల్లా కలెక్టర్ సంతకం తో నకిలీ నియామక పత్రాలు వారికి ఇచ్చారంటే అతని వెనక వున్నా అదృశ్య శక్తి ఎవరో పోలీసులు, ప్రభుత్వ యంత్రాగం సమగ్ర విచారణ చేపట్టాలని బెజవాడ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.బాధిత యువకులు స్పందన లో పిర్యాదు చేశారని, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అధికారం లోకి రాగానే విడుదల చేస్తాను అని చెప్పిన జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తూ వుంటే, అదే అదునుగా తీసుకున్న వైకాపా నాయకులు, అనుచరులు ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగ యువత దగ్గర లక్షలు డబ్బులు దండుకుంటూ వారిని మోసం చేయడం అన్యాయం అన్నారు. రెండు రోజుల క్రితం చీరాల కు చెందిన వైకాపా నాయకుడు, బాపట్ల ఎంపి నందిగాం సురేష్ ప్రధాన అనుచరుడు యాతం క్రాంతి కుమార్ పదిహేను మంది నిరుద్యోగ యువతను ఇదే విధంగా మోసం చేసి, వారు పిర్యాదు చేయగా విచారణ ఎదుర్కొంటున్న సమయం లో సాక్షాతూ సంతనూతల పాడు శాసన సభ్యులు టిజేఆర్ సుధాకర్ బాబు పిఏ బండారు సురేష్ ఇదే విధమైన మోసం చేయడం విస్మయం కలిగిస్తుందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు తగిన చర్యలు తీసుకుని నిరుద్యోగ యువత మోసపోకుండా చూడాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ డిమాండ్ చేశారు.

# ఎస్సీ,ఎస్టీ సెల్ విభాగంలో సి.ఐగా పదోన్నతి పొందిన యన్. వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపిన

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్.




**శుభ తెలంగాణ :**ఆగస్టు 24:చిలకలూరిపేట మండలంలో ఎస్సై గా విధులు నిర్వహించి, తదనంతరం నరసరావుపేట 1వ పట్టణ ఎస్సై గా పనిచేశారు. పోలీస్ శాఖ ప్రమోషన్లో భాగంగా ఎస్సైగా పని పనిచేస్తూన్నా యన్. వెంకటేశ్వరరావును సీఐలుగా పదోన్నతి పొంది పల్నాడు జిల్లాకు ఎస్సి,ఎస్టీ సెల్ విభాగానికి సీఐగా నియమితులయ్యారు. ఈ మేరకు నరసరావుపేట పట్టణ స్టేషన్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్ మాదిగ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పల్లె పోగు రాములు మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో వేళాపాళ లేని కరెంటు కోతలు

● తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే

● కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్న రైతులు , ప్రజలు.....




**శుభ తెలంగాణ :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత సమయం , సందర్భం లేకుండా కరెంటుకోతలు అధికమయ్యాయని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో నిరంతరం కరెంటు ఉండేదని , వ్యవసాయ రంగానికి నాణ్యమైన కరెంటు రైతులకు పగటిపూట ఉచితంగా 9గంటలు ఇచ్చేవారని ఒకవేళ ఎప్పుడైనా కరెంటుపోతే అదొకవింతగా కన్పించేదని , ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కరెంటువస్తే విచిత్రంగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మోషే తీవ్రమైన పదజాలంతో ఆరోపించారు. ప్రతిరోజు సాయంత్రం ఏడు గంటలకు కరెంటు పోతే అర్ధరాత్రి 12 గంటల వరకు కరెంటు కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందని మోషే వాపోయారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు పగటిపూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్తును వ్యవసాయ రంగానికి ఉచితంగా ఇస్తానని రైతులకు హామీఇచ్చి మోసం చేసారని , రైతులకు ఇచ్చిన హామీని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో రైతు వ్యతిరేకి ప్రభుత్వంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చరిత్ర పుటల్లోకి ఎక్కుతుందని మోషే ఘాటు వ్యాఖ్యలుచేశారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత కరెంటుచార్జీలు 9సార్లు పెంచారని ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారే తప్ప ఫలితం లేకుండా పోతుందన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగులు కరెంటు ఇచ్చినా జగన్ మోహన్ రెడ్డికి వాడుకునే విధానం తెలియక చంద్రబాబు ప్రభుత్వంలో డిస్కములతో చేసుకున్న ఒప్పందాలను జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రద్దుచేయడంతో దాని ఫలితమే నేడు రాష్ట్రంలోని ప్రజలు , రైతులు అనుభవిస్తూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మోషే ధ్వజమెత్తారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్ అందజేసిన మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు




**శుభ తెలంగాణ :**సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలోని కర్చల్ గ్రామానికి చెందిన గొల్ల మల్లేశంకు మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక్క లక్ష రూపాయలు రాయికోడ్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, కర్చల్ గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు గంప చంద్రశేఖర్ బిఆర్ఎస్ నాయకులు మనిల్ కుమార్, సల్మాన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు,

# పద్మభూషణ్ డా:చిరంజీవి గారి 68వ జన్మదినం ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్



చిలకలూరిపేట **శుభ తెలంగాణ :**చిలకలూరిపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పర్చూరు లో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం నందు ఆకు పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఉత్సవ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రదక్షణ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్ మాట్లాడుతూ చిరంజీవి నిండు నూరేళ్లు అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ఆకు పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు చిరంజీవి బ్లడ్ ఐ బ్యాంక్ ఏర్పాటు చేసి ఎంతోమందికి నేత్రదానం రక్తదానం చేసి ఎన్నో కుటుంబాలలో వెలుగులు నింపారని అన్నారు కరోన కష్ట సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటుచేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడి ప్రాణదాత అయ్యారని అన్నారు. తన తోటి సినీ కళాకారులకు సినిమా కార్మికులకు సి సి టి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిత్యవసర సరుకులు ఏర్పాటుచేసి వారి కుటుంబాలకు ఆపద్బాంధవుడు అయ్యారని అన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి నిండు నూరేళ్లు జీవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని చిలకలూరిపేట మండల అధ్యక్షులు పటాన్ ఖాదర్ బాషా చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు షేక్ మునీర్ హసన్ సాంబ పసుపులేటి సాయి వెంకటేష్ రవి మరియు పర్చూరు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్ వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య.



**శుభ తెలంగాణ :**గూడూరు మండలం భూపతి పేట గ్రామం కోమటిపల్లి లో విషాదం చోటుచేసుకుంది. తండాకు చెందిన ధరావత్ శివరాం ( 26) యువకుడిని చెన్నరావు పేట మండలం జల్లి తండాకు చెందిన కొర్ర ప్రవీణ్ అలియాస్ తాప్సి అనే ట్రాన్స్ జెండర్ ఫోన్లో వేధింపులకు గురి చేయడంతో జీవితం మీద విరక్తి చెంది ఆదివారం రోజున పురుగుల మందు తాగి మహబూబాబాద్ గవర్నమెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం నాడు ఉదయం 3 గంటలకి మృతి చెందాడు. గూడూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి తల్లి ధారావత్ నీలమ్మ నా కొడుకు ను నేను ఇది వరకే పెళ్లి చేసుకున్నానని ట్రాన్స్ జెండర్ అయినా కొర్ర ప్రవీణ్ అలియాస్ తాప్సి ఇదివరకు కొన్ని నెలల క్రితం నన్ను పెళ్లి చేసుకున్నాడని మేము రూపం ఇప్పుడు కలిసి ఉండటం లేదని ఇప్పుడు నన్ను పెళ్లి చేసుకోవాలని వేరే అమ్మాయిని పెళ్లి చేసుకోవద్దని మేము సంబంధం చూసిన అమ్మాయి తరపు తల్లిదండ్రులకు ఫోన్ చేసి శివరాం కు నాకు ఇది వరకే వివాహమైనదని ఇప్పుడెలా నేనుండగా ఎలా చేసుకుంటావని వారికి ఫోన్ చేసి వేధింపులకు గురి చేస్తున్నదని అమ్మాయి తరపు తల్లిదండ్రులు నా కుమారునికి ఫోన్ చేసి అడగడంతో ఆ విషయం తట్టుకోలేక ధారావత్ శివరాం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి గూడూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిందని అని తెలిపారు.ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు ఈ సంఘటనతో ధరావత్ శివరాం ఇంట్లో అర్ధనాథాలతో ఆ గ్రామంలో రోదనలు మిన్నంటాయి.

## కెసిఆర్ ను కలిసిన నూక కిరణ్ యాదవ్



**శుభ తెలంగాణ :** ప్రగతి భవన్ లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నూక కిరణ్ యాదవ్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ కి మంగళవారం పరిచయం చేస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ గాదరి కిశోర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోండి రానున్న రోజులు యువతయే అని తెలిపారు.

## కెసిఆర్ కు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే కిషోర్



**శుభ తెలంగాణ :** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితాను బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ప్రగతి భవన్ లో సీఎం కేసీఆర్ ని మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తో, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యే లతో కలిసి ధన్యవాదాలు తెలియజేసిన తుంగతుర్తి శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ మరియు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుమార్తెను కిరాతముగా మరియు దారుణముగా హత్యచేసిన తండ్రిని అరెస్ట్ చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు.

**కేవలం 7 గంటల కాల వ్యవధిలోనే హత్య కేసును ఛేధించిన పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని అభినందించిన ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీమతి మలిక గర్గ్, ఐపియస్.**




**ఒంగోలు ప్రతినిధి ఆగస్ట్22 శుభ తెలంగాణ :** ఉదయం 8-30 గంటల సమయంలో ఫిర్యాదుదారు బుచ్చిరాజు వెంకట నరసమ్మ భర్త బుచ్చిరాజు వెంకటేశ్వర్లు, వయస్సు 31 సంవత్సరాలు, పద్మాపురం గ్రామం, వెలిగండ్ల మండలం కనిగిరి పీఎస్‌కి వచ్చి ఫిర్యాదు చేశారు. ఉదయం 7:30 గంటలకి ఆమె తన సోదరుడు శ్రీనివాసులుతో కలిసి రోజువారీ కూలీ పనుల కోసం కనిగిరికి వస్తుండగా, వారు ఎన్.గొల్లపల్లి గ్రామ శివారులోకి రాగానే కొందరు గ్రామస్తులు గుమిగూడి ఓ పాఠశాల విద్యార్థిని హత్య చేసి ఆ మృతదేహాన్ని సమీపంలోని పొదల్లో వదిలేశారని మాట్లాడుతుండగా వెంటనే ఆమె మరియు తన సోదరుడు అక్కడికి చేరుకుని మృతురాలు కనిగిరి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తన కుమార్తె బుచ్చిరాజు మంజుల (13) అని గుర్తించారు.

కేసు వివరములు: ముద్దాయి బూచిరాజు వెంకటేశ్వర్లు తండ్రి మాలకొండయ్య, సుమారు 16 సం.ల క్రితం వెలిగండ్ల మండలం, పద్మాపురం గ్రామానికి చెందిన వెంకట నరసమ్మ(ఫిర్యాది) అను ఆమెను వివాహము చేసుకున్నాడు. వారికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానము. వారిలో పెద్ద కుమార్తె పేరు 1.బూచిరాజు స్రవంతి,వయసు 15సం.రాలు 2. బూచిరాజు మంజుల (మృతురాలు), వయసు 13సం.రాలు 3. మనోజ్ 10 సం.లు. ముద్దాయి, తన కుటుంబముతో తెలంగాణ రాష్ట్రంలో తాపీ పనుల నిమిత్తము వెళ్ళిన సమయంలో కూడా మద్యం సేవించి తన భార్యను అనుమానిస్తూ మానసికంగా హింసిస్తూ ఉండేవాడు. సుమారు 11 నెలల క్రితం కనిగిరి పట్టణంలో గల శివనగర్ కాలనీలో తన కుటుంబముతో కలసి అద్దె ఇంటిలో ఉంటున్నాడు. అప్పటినుంచి మృతురాలు అయిన మంజుల తల్లిదండ్రులతో కలసి ఉంటూ జెడ్పీ గర్ల్స్ హై స్కూల్ లో 7 వ తరగతి చదువుతున్నది. ముద్దాయి అయిన వెంకటేశ్వర్లు తన ప్రవర్తన మార్చుకోకుండా ప్రతి రోజూ మద్యం సేవిస్తూ తన భార్య వెంకట నరసమ్మ తో మరియు తన కుమార్తె మంజులతో గోడవపడుతూ, కొడుతూ చంపుతానని బెదిరిస్తూ ఉండగా సుమారు 2 నెలల క్రితం ఫిర్యాది తన కుమార్తె మంజుల(మృతురాలు)ను తీసుకుని తన పుట్టినిల్లు అయిన పద్మాపురం గ్రామలో నివాసము ఉంటున్నది.

ఫిర్యాది కుమార్తె మృతురాలు మంజుల పద్మాపురంలోని తన తల్లి దగ్గర ఉంటూ ప్రతిరోజూ ఉదయం పద్మాపురం నుండి కనిగిరి స్కూల్ కి వెళ్ళి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుంది.ఈ క్రమంలో ది21.08.2023 వ తేదీన ఉదయం తన మేనమామ అయిన శ్రీనివాసులు మంజుల(మృతురాలు)ని తన మోటార్ సైకిల్ మీద తీసుకుని కనిగిరిలోని స్కూల్ లో వదిలిపెట్టినాడు. మరియు అదే రోజు సాయంత్రం 4.30 గం. లకు ముద్దాయి మరియు మృతురాలి తండ్రి అయిన వెంకటేశ్వర్లు స్కూల్ వద్దకు వెళ్ళి మంజుల(మృతురాలు)ని తీసుకుని ఆటోలో ఎన్.గొల్లపల్లి గ్రామ శివారులో ఆటోలో నుంచి దిగి పద్మాపురం వెళ్ళే కాలి బాట వైపుగా తీసుకొనివెళ్లి గ్రామ శివారులో గల చెరువు సమీపాన అతిదారుణంగా, కిరాతముగా రాయితో మొఖముపై, తలపై బలంగా కొట్టి చంపినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు.

నేరము జరిగిన వెంటనే ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీమతి మలిక గర్గ్, ఐపియస్., ఈ కేసును సీరియస్ గా తీసుకోని పోలీసు అధికారులకు పలు సూచనలు తెలియచేసారు. ఈకేసును త్వరితగతిన ఛేదించాలని ఇచ్చిన ఆదేశాలమేరకు క్రైమ్ అడిషినల్ శ్రీధర్ , కనిగిరి రామరాజు పరివేక్షణలో కనిగిరి శివ రామ కృష్ణ రెడ్డి ప్రత్యేక బృందాలతో ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి తన సిబ్బందితో ముద్దాయిను అరెస్ట్ చేయటమైనది.

ఈ కేసును త్వరితగతిన చేధించిన క్రైమ్ అడిషినల్ శ్రీధర్, కనిగిరి ఆర్ రామరాజు, కనిగిరి ఎ.శివరామ కృష్ణ రెడ్డి, పామూరు కె. శ్రీనివాసరావు, కనిగిరి డి.ప్రసాద్ మరియు వారికి దర్యాప్తులో సహకరించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులను నియంత్రించాలి

**తెలంగాణ దళిత నిరుపేద అభివృద్ధి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంధు వెంకన్న**



**శుభ తెలంగాణ :** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలలో అధిక ఫీజులను నియంత్రించాలని తెలంగాణ దళిత నిరుపేద అభివృద్ధి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంధు వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పట్టణం లోని ప్రైవేట్ పాఠశాలలలో నిరు పేద విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ... తల్లి తండ్రులను భయ బ్రాంతులకు గురి చేస్తూ.. విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారని, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తూ, విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే ఫీజులు తగ్గించి విద్యార్థులకు మేలు చేయాలనీ డిమాండ్ చేశారు. తగ్గించకపోతే భవిష్యత్ లో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో వెలికట్ట గ్రామ ఉప సర్పంచ్ దీకొండ యాకన్న,యాదవ సంఘం నాయకులు ఎద్దు మల్లేశం, ఎమ్మార్పీఎస్ వెలికట్ట గ్రామ అధ్యక్షులు బందు శ్రీనివాస్, సంఘం నాయకులు యాసారపు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఇబ్బందుల్లో అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీయే



**టిపిసిసి ఉపాధ్యక్షులు మల్రెడ్డి రంగారెడ్డి**

**శుభ తెలంగాణ :**ప్రజల కష్టసుఖాల్లో ఆదరణగా అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ అని టిపిసిసి ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో తన పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల బాధిత కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆదరించి ధైర్యపరిచి ఆర్థిక సాయం అందజేశారు. మొగుళ్ళవంపులో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాంరెడ్డి మృతి చెందగా కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ధైర్యం నింపారు. తక్కల్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్త మృతిచెందగా కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేయడంతో పాటు పిల్లల చదువులకు బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతరం మాల్ గ్రామంలో ఉప సర్పంచ్ జనమోని మాధవి - గోపాల్ తల్లి మల్లమ్మ మృతిచెందగా కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామంలో మృతి చెందిన పార్టీ కార్యకర్త బెల్లి రోశయ్య కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ మెంబెర్ కొత్త కుర్మ శివకుమార్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, జ్యోతి శ్రీనివాస్ నాయక్, వైస్ ఎంపీపీ కే. శ్రీనివాస్ రెడ్డి, మంతన్ గౌరెల్లి ఎంపిటిసి కొర్ర జ్యోతి - అరవింద్ నాయక్, సర్పంచులు పడకంటి కవిత శేఖర్, సర్పంచ్ లిక్కి సరిత పాండు రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మస్కు నర్సింహ, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, చిన్నోళ్ల జహంగీర్, బిల్లి జంగయ్య, సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు గులాం అక్బర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముచర్ల సంపత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే శ్రీశైలం, అమృత సాగర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, దెంది రామనాథ్ రెడ్డి, గొట్టం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలి.!

- అడ్డుకున్న ఆధిపత్య కులాల వారిపై ఎస్సి ఎస్టీ కేసు పెట్టి అరెస్ట్ చేయాలి.!!
- ఏపిసిసి సభ్యులు కాంగ్రెస్ పార్టి నియోజకవర్గ ఇన్చార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు



**శుభ తెలంగాణ :**తిరుపతి జిల్లా పుత్తూరు మండలం గొల్లపల్లి గ్రామంలో పోలక్షమ్మ గుడి జాతర సందర్భంగా దళితులు పొంగళ్ళు పెట్టుకోవడానికి వెళ్ళితే పూజారి మరియు ఆధిపత్య కుల పెద్దలు అడ్డుకోవడం సిగ్గుచేటు అని ఏపిసిసి సభ్యులు యర్రగొండపాలెం కాంగ్రెస్ పార్టి నియోజకవర్గ ఇన్చార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు అన్నారు.ఇది ఇలా ఉంటే ఇదే అదనుగా భావించిన ఆలయ చైర్మన్ శ్రీనివాసుల రెడ్డి దళితుల మధ్య చిచ్చు పెట్టి రెండు వర్గాలుగా విభజించి రాజకీయ కుటిల బుద్దిని ప్రదర్శించారని దళితులకు ఆలయ ప్రవేశం లేకుండా గుడికి తాళం వేసి వివక్షతను పాటిస్తున్నారని మండిపడ్డారు.ఈ దుశ్చర్య పట్ల దేవాదాయ శాఖ అధికారులు మరియు పాలకులు స్పందించక పోవడం సిగ్గుచేటని తీవ్రంగా ఖండించారు.భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏడేళ్లు కావస్తున్న ఇలాంటి దుర్మార్గమైన కులదురంకార చర్యలు జరగటం ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయమని గుడిలోకి రానివ్వని పూజారి,తాళాలు వేసిన పెత్తందారులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఇలాంటి దుర్మార్గమైన దారుణమైన కులదురంకార సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోల్కమ్మ చెరువు, ఎఫ్.టి.ఎల్ లో అక్రమంగా వేసిన రోడ్డును తొలగించాలి...

- ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు వినతిపత్రం..
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ..



**అబ్దుల్లాపూర్మెట్, ఆగస్టు 22 శుభ తెలంగాణ :** అబ్దుల్లాపూర్మెట్టు మండలం తారమతిపేట గ్రామ పోల్కమ్మ చెరువు, ఎఫ్.టి.ఎల్ లో అక్రమంగా రోడ్డు వేస్తున్న విషయంలో రోడ్లు వెంటనే ఆపి వేసిన రోడ్డును తొలగించి వారి పైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్డిఓ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్మెట్ మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్థుల చేతుల్లో కబ్జాలకు గురవుతున్న, ఇరిగేషన్, అధికారులు వ్యాపారస్తుల దగ్గర డబ్బులు కాశపడి, ఎఫ్.టి.ఎల్ హద్దు రాల్లను మార్చివేస్తూ, ఎఫ్.టి.ఎల్ బప్పర్ జోన్లలో, పర్మిషన్ ఇస్తున్న ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు కూడా పట్టించుకోకుండా ఉంటున్నారు. దీనివల్ల చెరువులు, కుంటలు, వాగులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు వ్యాపారస్తులతో కుమ్మకై కబ్జాలు చేస్తున్నారని అన్నారు. వెంటనే పోల్కమ్మచెరువులో వేస్తున్న రోడ్డుని తొలగించాలని లేకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శంకర్, శివ బాబు, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## చీకటాయపాలెం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక....

- పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తా.
- నూతన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుండి వీరన్న

**శుభ తెలంగాణ :**మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండలం, చీకటాయపాలెం గ్రామంలో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్స్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులుగా దుండి వీరన్న, ప్రధాన కార్యదర్శి చిన్నాల ధనంజయ్, ఉపాధ్యక్షులు ఆలకుంట్ల సైదులు,
మహిళా అధ్యక్షురాలుగా వేల్పుగొండ శోభ, మహిళా ఉపాధ్యక్షురాలు బొలగాని ఊర్మిళ, యూత్ అధ్యక్షులు గజ్జి మహేష్,
యూత్ ఉపాధ్యక్షులు భాషబోయిన ప్రశాంత్,
యూత్ ప్రధాన కార్యదర్శి కొండ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు వేల్పుగొండ చిన్న వెంకన్న,ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బూర్గుల సైదులు, బీసీ సెల్ అధ్యక్షులు ఓడపెల్లి కంట్ల%శీ, %బీసీ సెల్ ఉపాధ్యక్షులు కొండ రామచంద్రు, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఎం.డి షబ్బీర్, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎస్.కె లతీఫ్,
కిసాన్ సెల్ అధ్యక్షులు వేల్పుగొండ వెంకటనర్సు, కిసాన్ సెల్ ఉపాధ్యక్షులుగా వేల్పుగొండ ముత్తయ్య లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుండి వీరన్న మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుల కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు మేకల కుమార్, అశోక్ రెడ్డి, ధర్మారపు మహేందర్, నాగిరెడ్డి,



జినుగా రవీందర్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తండ రవి , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బూర్గుల ప్రశాంతి, మండల నాయకులు ఎద్దు మహేష్, మహిబూబ్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకము.

- జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్




**శుభ తెలంగాణ :**ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ఓటు కీలకపాత్ర పోషిస్తుందని మహబూబాబాద్ జిల్లా జడ్పిఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని తొర్రూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తొర్రూర్ ఉప తహశీల్దార్ టి శ్రీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ఎక్కువసార్లు వినియోగించుకున్న వయోవృద్ధులను మరియు నూతన ఓటర్లను శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మనదేశంలో సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయని అందుకు భారత రాజ్యాంగం మనకు ఇచ్చినటువంటి అత్యంత గొప్పనైన హక్కు ఓటు హక్కు ఇట్టి ఓటు హక్కును ఎక్కువసార్లు ఉపయోగించి ఓటును క్రమ పద్ధతిలో క్రమం తప్పకుండా ఎక్కువసార్లు వినియోగించుకున్న ఓటర్ నీ సీనియర్ సిటిజన్ గా పిలవడం జరుగుతుందని ఇలాంటి సీనియర్ సిటిజన్స్ ను మనం ఈరోజు సన్మానించుకోవడం చాలా ఆనందంగా ఉందని అలాగే రాబోయే ఎన్నికల్లో నూతనంగా ఓటు వేసే యువకులను సన్మానించుకోవడం కూడా సంతోషకరమని ఆయన తెలిపారు. భారతదేశంలో రాజ్యాంగం పట్ల నమ్మకం ఉండి రాజ్యాంగం పట్ల విలువలతో కూడిన గౌరవం ఉన్న ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి ఎండి గౌస్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి గౌస్, దుబ్బంతండా సర్పంచ్ విజయ్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షులు ఇట్టే సోమారెడ్డి, మండల రెవెన్యూ సిబ్బంది, బూతు లెవెల్ అధికారులు,సీనియర్ సిటిజెన్లు, ఎలక్షన్స్ కంప్యూటర్ ఆపరేటర్ మల్లారెడ్డి, మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం

- పీఏసీఎస్ చైర్మన్ హరి ప్రసాద్, బోప్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్





**శుభ తెలంగాణ :** ఐక్యతతోనే బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారమవుతాయని పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్, బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (బోప్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ లు అన్నారు.
డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో పాలకుర్తి నియోజకవర్గ బ్రాహ్మణ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
నియోజకవర్గ అధ్యక్షునిగా కొల్లా వజ్జుల రమేష్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఏడునూతల ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా ఓలేటి వెంకటాచార్యులు ఎన్నికయ్యారు.
పీఏసీఎస్ చైర్మన్ హరి ప్రసాద్, బోప్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్ శర్మలు నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.
ఈ సందర్భంగా హరిప్రసాద్, సుధాకర్ లు మాట్లాడుతూ.... రాష్ట్రంలో 25 లక్షల జనాభా కలిగిన బ్రాహ్మణ సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించి గౌరవం కల్పించాలన్నారు.
బ్రాహ్మణ పక్షపాతి సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ తరపున 10 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని కోరారు.
కరీంనగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్ లో బ్రాహ్మణులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు.
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే బ్రాహ్మణ పరిషత్ స్థాపనతో బ్రాహ్మణులకు సముచిత స్థానం లభించిందని, అంతకుముందు ఉన్న ప్రభుత్వాలు బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు.
బ్రాహ్మణులులలో అనేక మంది నిరుపేదలు ఉన్నట్లు గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ వారి కుటుంబాలలో వెలుగులు నింపేలా వేలాది మంది అర్చకులకు గౌరవ వేతనం అందిస్తున్నాడని గుర్తు చేశారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ప్రతి ఏటా కోట్లాది నిధులను కేటాయించి నిరుపేద బ్రాహ్మణులకు వివిధ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నాడన్నారు.
బ్రాహ్మణులకు వేతనాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని తెలిపారు.
బ్రాహ్మణ పరిషత్‌కు రూ. 100 కోట్లు కేటాయించి బ్రాహ్మణుల ఆత్మగౌరవం పెంచారని, హిందూ ధర్మాన్ని రక్షించడానికే 9 ఎకరాలలో రూ. 12 కోట్లతో బ్రాహ్మణ సదన్‌ను నిర్మించడం శుభపరిణామన్నారు.
తొర్రూరు, పాలకుర్తి మండలాల్లో బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, తొర్రూరులో వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణం, వేద పాఠశాల కొరకు ప్రభుత్వం భూమి కేటాయించాలని కోరారు.
బ్రాహ్మణుల సౌకర్యార్థం తొర్రూరు పట్టణంలో బ్రాహ్మణ భవన్ ఏర్పాటు చేయాలని సమావేశంలో ప్రతినిధులు కోరారు.
ఈ కార్యక్రమంలో ప్రతినిధులు తమ్మెర విశ్వేశ్వర రావు, వీరభద్రరావు, గంగు శ్రావణ్ శర్మ, రఘు శర్మ, ఓలేటి వెంకటాచార్యులు, సంపత్ కుమార్ ఆచార్యులు, ఓలేటి లక్ష్మణాచార్యులు, కొల్లావజ్జుల రమేష్, అలహరి శ్యామ్, ఉప్పల సురేష్ బాబు, విజయ్ కుమార్, రాంబాబు, నరసింహమూర్తి , సుదీర్, పండిత్ కె వి సింగ్, రాము, పోలంపల్లి రమణ శర్మ, అన్నావజ్జుల ప్రసాద్ శర్మ, చక్రవర్తుల వరదరాజు, రాజేష్ గుగ్గిళ్ళ శ్రీరామ్ శర్మ, రాజేష్ శర్మ, పవన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అసమాన కలం యోధుడు షోయబ్ ఉల్లాఖాన్ ఆశయ సాధనకు కృషి చేద్దాం.

- యునైటెడ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ కొమ్మనబోయిన యాకయ్య.
- తొర్రూరులో వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో షోయబ్ ఉల్లాఖాన్ 75వ వర్ధంతి సభ.




**శుభ తెలంగాణ :**స్వతంత్ర భారత దేశంలో పత్రికా స్వేచ్ఛ కోసం ప్రాణాలు వదిలిన తొలి తరం కలం వీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ ఆశయ సాధనకు కృషి చేయాలని యునైటెడ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ కొమ్మనబోయిన యాకయ్య అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం సమీపంలో అమరవీరుల స్థూపం వద్ద నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అక్షర సమరం చేసిన కలం కార్మికుడు షోయబ్ ఉల్లాఖాన్ 75వ వర్ధంతి సందర్భంగా తొర్రూరు వర్కింగ్ జర్నలిస్టులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ సమాజం కోసం అణగారిన వర్గాల ప్రజల కోసం ఏదో చేయాలన్న తపనతో జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకొని సమసమాజ స్థాపన కోసం అక్షర ఆయుధంతో పోరాడిన కలం యోధుడు షోయబ్ ఉల్లాఖాన్ అని కొనియాడారు. మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాదకుడిగా చేరి, నిరంకుశ నిజాం ప్రభుత్వానికి తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచకాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను చేసే సంధించిన కలంకార్మికుడని అన్నారు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేస్తున్న క్రమంలో నిజాం ప్రభుత్వం కక్షగట్టి 'తేజ్' పత్రికను నిషేధించడంతో ఆ తర్వాత మందుముల నర్సింగరావు ఆధ్వర్యంలో వెలువడుతున్న 'రయ్యత్' అనే ఉర్దూ దినపత్రికలో చేరి.. పాలకవర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడని అన్నారు. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను కూడా మూసి వేయించిందని తెలిపారు. షోయబ్ ఉల్లా ఖాన్ సతీమణి, తల్లి ఆభరణాలు అమ్మి 'ఇమ్రోజ్' అనే ఉర్దూ పత్రికను ప్రారంభించాడని అన్నారు. 'ఇమ్రోజ్' దినపత్రిక తొలి సంచిక 1947 నవంబరు 1 వ తేదీన వెలువడిందని. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాసిన దీశాలి షోయబ్ అది అన్నారు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్న నికార్సైన జర్నలిస్టు షోయబ్ ఉల్లాఖాన్ అని అన్నారు. నిండా 30 ఏళ్లు కూడా నిండని యువ జర్నలిస్టు నిజాం నిరంకుషానికి ఎదురుగా నిలబడి కథనాలు రాసినందుకు ఆ కథనాలు రాసిన తన కుడిచేయిని నరికి వేసి రజాకార్లు హత్య చేశారని అన్నారు. 1948 ఆగస్టు 21వ తేదిన కాచిగూడ రైల్వే స్టేషను రోడ్ లో నడిచి వెళ్తుండగా రజాకారు ముష్కరులు వార్తలు రాసే షోయబ్ ఉల్లా ఖాన్ కుడి అరచేతిని ముష్కరులు నరికేశారని... 1948 ఆగస్టు 22 న తెల్లవారుజామున షోయబ్ తుది శ్వాస విడిచాడని... నిజాం సర్కార్ షోయబ్ ఉల్లాఖాన్ అంతిమయాత్రను నిషేధించిందని... అంతిమ యాత్ర కూడా పోలీసు బందూకుల మధ్య జరిగిందని తెలిపారు. సమసమాజ స్థాపన కోసం అక్షరాన్ని ఆయుధంగా చేసి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన షోయబుల్లాఖాన్ ను ప్రతి ఒక్క జర్నలిస్టు ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కథనాలు రాయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు వర్కింగ్ జర్నలిస్టులు పల్లె యాకాంతం, గట్టు కిరణ్, చేను రామకృష్ణ, వేర్పుల మహేష్, అంకం సురేష్, దుర్సోజు వీరాంజనేయులు, గంగారపు మధు, కిషన్ చారి, గూడెల్లి యాకన్న, పున్న%శీ% సారయ్య, రెడ్డబోయిన దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## మరోమారు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

- సీఎం కేసీఆర్ ప్రకటనతో నందీశ్వరుని సందర్శన
- నందీశ్వర మహా క్షేత్రంలో ప్రత్యేక పూజలు
- ఎన్నిక ప్రచారం కూడా నందివనపర్తి గ్రామం నుంచే మొదలు



**ఇబ్రహీంపట్నం, శుభ తెలంగాణ :**రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ఇబ్రహీంపట్నం నియోజవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పార్టీ అధినేత చంద్రశేఖర్ రావు సోమవారం టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డికి టికెట్ ఖరారు చేస్తూ ప్రకటించడంతో మంగళవారం యాచారం మండల నందివనపర్తి గ్రామంలో శ్రీశ్రీశ్రీ నందీశ్వర మహాక్షేత్రంలో నందిశ్వరుణ్ణి బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రజల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రాధాన్యతగా భావిస్తున్నారని అదే తరహాలో నియోజకవర్గంలో ఏ రంగానికి మినహాయించకుండా అభివృద్ధి, సంక్షేమానికి అనుగుణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని అన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చామని అన్నారు. తెలంగాణలో ఇబ్రహింపట్నం అభివృద్ధి ముందుందని అన్నారు. బిఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ కు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కెసిఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కెసిఆర్ , నియోజకవర్గంలో మరొకసారి బిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, జడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య,మాజీ సర్పంచ్ రాజు నాయక్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి ప్రాచ్య భాష, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్,మాజీ సర్పంచ్ రాజు నాయక్, బి.ఎన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు కొంగళ్ళ జోగిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు సంఘం రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మండల గోపాల్, గ్రామ శాఖ అధ్యక్షులు పంది సుధాకర్, మాజీ వార్డు సభ్యులు తెలగమళ్ళ ప్రవీణ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి గెలుపు దిశగా కార్యకర్తలకు కృషి చేయాలి

బిజెపి ఎమ్మెల్యే భూడాన్ ముర్మ
డోర్నకల్ లో బిజెపి జెండా ఎగరవేయడం ఖాయం
నియోజకవర్గ బిజెపి నాయకులు బానోత్ ప్రభాస్ నాయక్



**నర్సింహులపేట, శుభ తెలంగాణ :** రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీని గడపగడపకు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి, ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు, ఒరిస్సా బిజెపి ఎమ్మెల్యే భూడాన్ ముర్మ అన్నారు. సోమవారం నర్సింహులపేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని డోర్నకల్ నియోజకవర్గ నాయకులు భానోత్ ప్రభాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిజెపి ఎమ్మెల్యే భూడాన్ ముర్మ హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా, ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, ఇప్పటి నుండే పార్టీ కార్యక్రమాలను, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, ప్రతి గడపగడపకు తీసుకుపోయి, ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలకు నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఒరిస్సా బీజేపీ ఎమ్మెల్యే బుధాన ముర్మ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, డోర్నకల్ అసెంబ్లీ కన్వీనర్ పూర్ణచందర్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, గిరిజన మోర్చా నాయకురాలు దేవిక నాయక్, నాయకులు బుల్లెట్ కృష్ణ, కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## హయత్ నగర్ లో విషాదం.. లిఫ్ట్ గుంతలో పడి బాలుడు మృతి...

భవన నిర్మాణదారుడు నిర్లక్ష్యం వల్లే..


మృతుడు వరద రాఘవేందర్

**శుభ తెలంగాణ :**భవన నిర్మాణదారుడి నిర్లక్ష్యం ఓ బాలుడి ప్రాణాలను బలితీసుకుంది. లిఫ్ట్ గుంతలో పడి ఓ ఏడేళ్ళ బాలుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మంగళవారం హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకొచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి హయత్ నగర్ సబ్ఇన్స్పెక్టర్ నర్సింహ వెల్లడించిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండలం, పాతర్లపాడు గ్రామనికి చెందిన వరద సైదులు, భార్య శోభ కొంతకాలం క్రితం జీవనోపాధికోసం నగరానికి వలసవచ్చి హయత్ నగర్ బొమ్మలగుడి ప్రాంతంలోని లక్ష్మీ భవానీ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరు స్థానికంగా ఉన్నటువంటి ఓగృహ సముదాయంలో వాచ్మెన్ గా పనిచేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు వరద రాఘవేందర్ (7) సోమవారం రాత్రి సమీపంలో నిర్మాణంలో ఉన్నటువంటి ఓ భవంతి వద్దకు వెళ్ళి లిఫ్ట్ గుంతలో పడి ప్రాణాలు కోల్పోయాడు. భవన నిర్మాణదారుడి నిర్లక్ష్యంతో తమ కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని ఆ నిరుపేద దంపతులు రోదించిన తీరు స్థానికుల మనసు కలిచివేసింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారు శుభాకాంక్షలు తెలియజేసిన పాలకుర్తి నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం



**శుభ తెలంగాణ :**త్వరలో జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఈరోజు ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు ప్రకటించారు.
అందులో భాగంగా పాలకుర్తి నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు గారిని ప్రకటించిన సందర్భంగా వివిధ మండలాలకు చెందిన పార్టీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ కొండూరు వెంకటేశ్వర్ రెడ్డి పాలకుర్తి దేవస్థానం చైర్మన్ రామచంద్ర శర్మ తొర్రూర్ మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు జెడ్పిటిసి తొర్రూర్ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపిపి అంజయ్య, మాజీ జెసిబి చైర్మన్ గాంధీ నాయక్ గాంధీ నాయక్. ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణ గౌడ్, కొడకండ్ల మండల పార్టీ అధ్యక్షుడు సింగర్ రామోజీ పెద్దవంగర మండల నాయకులు శ్రీరామ్ సుధీర్, సీనియర్ నాయకులు నగరకంటి కొమురయ్య , మైనార్టీ నాయకులు అంకూస్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by Sri ChandraShekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :ChandraShekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com